

# టూరిస్టు బస్సు

కథ

కె. అపూర్వదేవి

తిరుపతి నుంచి ఎలభయిమంది యాత్రీకులతో బయల్దేరిన టూరిస్ట్ బస్‌లో డాక్టర్ చంద్రం, అతని అయిదేళ్ళ కొడుకు గోపీ కూడా వున్నారు. మధ్యాహ్నం మూడు అయింది. ఆకాశం మబ్బుపట్టి — మసక మసగ్గా వుంది. ఈదురుగాలులేం లేవుగాని చల్లగా వుంది.

డాక్టర్ చంద్రం ఆ బస్సులో ప్రయాణం చెయ్యటం అనుకోని పరిస్థితుల్లో జరిగింది. మూడురోజుల క్రితం మద్రాసు నుంచి ట్రంక్‌కాల్ వచ్చింది — ఓ ఫిలిం ప్రొడ్యూసర్ దగ్గర్నుంచి. అతను తీసే కొత్త చిత్రంలో ఓ పిల్లవాడి పాత్రకి గోపీ ఫోటో వ్యవహారంలో డాక్టర్ చంద్రం బంధువులెవ్వరో పంపారట. వెంటనే ఆయన తీస్తున్న పిక్చర్‌లో మెయిన్‌రోల్‌కి వాడా కుర్రాణ్ణి బుక్‌చేద్దామన్న సంకల్పం కలిగింది. సినిమాలోకి కాడికి ప్రాముఖ్యం వున్న పాత్ర, కథంతా వాడి చుట్టూ తిరుగుతుంది అని ప్రొడ్యూసర్ ఫోన్‌లో ఎంతో ఆవేశంగా చెప్పాడంటే గోపీ ఫోటో తనకి బాగా నచ్చిందని, అసలు బుక్ చేసేసినట్లే అనీ, రెండు మూడురోజుల్లో ప్యాచ్‌వర్కు వుందనీ, అందులో కూడా నటించాలి కాబట్టి వెంటనే బయల్దేరి రమ్మని మరీ మరీ కోరుతూ చెప్పాడు. కాని వెన్నాట అయిదారు రోజుల్నుంచీ పెద్ద గాలివాన. ఇటీవలి కాలంలో కనీవినీ ఎరుగని గాలివాన. రైలు మార్గాలన్నీ ధ్వంసమైపోయాయి. రోడ్లన్నీ దెబ్బతిన్నాయి — భారీ ఎత్తున. సేన్స మార్గం ఒకటో రెండో రైళ్లు పని చేస్తున్నాయి మద్రాసుకి — వినండి వాడకి మళ్ళీ. ప్రయాణాలన్నీ బందయిపోయాయి ఆ విషయమే చెప్పాడు డాక్టర్ చంద్రం. హైదరాబాదు రేడు దిగగానే వుప్పుట్లు తనకి తెలిసినంత, అక్కడి గోదా కారులో వచ్చి, అక్కడి నుంచి ప్లేన్‌లో మద్రాసు రమ్మని, ఎట్టి పరిస్థితుల్లోనైనా రావటం మానవద్దని మరీ మరీ నొక్కి బతిమాలాడు ప్రొడ్యూసర్. ఫోన్‌లో మాట్లాడటమే పోయింది, డాక్టర్ చంద్రం మీమాంసలో పడ్డాడు. గోపీని యీపాటికే స్కూల్లో చేర్పించాడు. సినిమాల్లో చేర్పిస్తే చాలా రోజులు మద్రాసులో వుండాల్సి వస్తుంది. చదువో? చీటికి మాటికి మద్రాసు తిరగాల్సివస్తే యిక్కడి ప్రాక్టీసు కాని సినిమా చాన్సు సంగతి గాని అతని భార్య కమల సరదా పడింది ఏమయినాసరే చేర్పించాలని పట్టుబట్టింది. అవసరమైతే తను గోపీతోపాటు తోడుగా మద్రాసులో వుంటానంది. ఆమె ఉత్సాహం సంగతి అలా వుంచి డాక్టర్ చంద్రం కూడా సహజంగా కళాప్రియుడు. కాలేజీ రోజుల్లో మంచి నటుడు అతనికి సరదాగానే వుంది సరు వాడ గోపీని తీసుకుని టాక్సీలో హైదరాబాదు బయల్దేరాడు. ప్రొడ్యూసర్ పంపుతానన్న చేవాడుగాని ఖర్చుల నిమిత్తమయే డబ్బు గురించే ఏం ప్రస్తావించలేదు. ఫోన్‌లో అడగటానికి యితనూ మొహమాటపడ్డాడు. సరే అక్కడికి వెళ్ళాక చూద్దాంలే అనుకున్నాడు.

హైదరాబాదు నుంచి ప్లేన్‌లో అక్క

# టూరిస్ట్ బస్

డికి వెళ్ళాక—వాతావరణం ఊహించినట్లుగా గాక మరో రకంగా వుంది. డాక్టర్ చంద్రం బంధువులింట్లో నుంచి ప్రొడ్యూసర్‌కి ఫోన్ చెయ్యగానే బాగనే మాట్లాడి మరునాడు ప్రొద్దుటే కారు పంపిస్తానన్నాడు ఎక్కడ దిగారో అడ్రెస్ తెలుసుకుని. మరునాడు ఉదయమన్నది మధ్యాహ్నం దాకా రాలేదు కారు. మధ్యాహ్నం రెండుగంటలకు వచ్చింది. అప్పటికి గోపీ కునికిపాట్లు పడుతున్నాడు. తండ్రీ కొడుకుల్ని ఎక్కించుకుని బయల్దేరిన కారు తిన్నగా ప్రొడ్యూసర్‌గారి దగ్గరకు పోకుండా మధ్యలో రెండు యిళ్ళ దగ్గర ఆగి అక్కడ కూడా తండ్రుల్నీ పిల్లల్నీ ఎక్కించుకుంది. ఈ ధోరణి డాక్టర్ చంద్రానికేమీ నచ్చలేదు. కారులో అంతా క్రిక్కిరిసి కూర్చోవల్సి వచ్చింది. తర్వాత తిన్నగా స్టూడియోలోనే వెళ్ళి ఆగింది.

ప్రొడ్యూసర్‌గారు లోపల షూటింగులో బిజీగా వున్నాడు. అరగంటవాకా ఆయన దర్శనమే కాలేదు. కుర్రాడికి ప్రమేయం లేని భాగం షూటింగు జరిగిపోతోంది. గోపీ భుజం మీద చెయ్యివేసి వో ప్రక్కన నిలబడి డాక్టర్ చంద్రం కూడా షూటింగు చూడసాగాడు—ఏం చెయ్యాలో తెలియక. ఆ సన్నివేశం పదిసార్లు రీటేక్సు కట్‌లు పడి, పదకొండోసారి రసవత్తరంగా వచ్చిందనుకునేటంతలో గోపీ గట్టిగా దగ్గటంతో కట్ కట్ అరుపులతో మళ్ళీ బ్రేకు పడింది.

'ఎవరూ దగ్గింది?' అని ప్రొడ్యూసర్‌గారు కుర్చీలోంచి లేచి నవ్వు మొహంతోనే యివతలకి వచ్చారు. అప్పుడు డాక్టర్ చంద్రం తానే పరిచయం చేసుకున్నారు. 'అరెరె మీరు వచ్చేశారా?' అని అప్పుడు కుర్చీలు తెప్పించి వేశాడు.

కాని ఆయన ధోరణి ఎలావున్నదంటే—యీ తండ్రీకొడుకులే పనిగట్టుకుని సినిమా మోజుతో వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. డాక్టర్ చంద్రానికి చిన్నతనమనిపించింది. ఫోటో చూసే బుక్ చేసేశానన్నాను స్క్రీన్ టెస్టు తియ్యాలన్నాడు. మేకప్ టెస్టన్నారు. రెండు రోజులు త్రిప్పాడు. చివరికి పెదవి చప్పరించి 'కుర్రాడు బాగానే వున్నాడుగాని కళ్ళుకొంచెం చిన్నవైనాయి. నవ్వినప్పుడు పళ్ళు సరిగ్గా కనబడటం లేదు. ఇతను పనికి రాడనుకుంటాను' అని కాసేపు నసిగి 'అబ్బే! పనికిరాడండీ' అని తేల్చి చెప్పేశాడు. డాక్టర్ చంద్రానికి సర్రున కోపమొచ్చింది. వళ్ళంతా వేడెక్కింది. ప్రొడ్యూసర్ని నాలుగూ గుద్ది పెయ్యాలనుకున్నాడు. సభ్యత అడ్డొచ్చింది. డబ్బు విషయం మొహమాటమడ్డు వచ్చింది.

బంధువులింట్లో అప్పుడే గోపీ సినిమాల్లో యాక్టు చేసేస్తున్నాడని, అంతా సెటిల్ అయిపోయిందనీ అనుకోవటం, ఆ వార్త యిరుగుపొరుగుకి కూడా చెప్పటం జరిగింది. వాళ్ళకి అసలు విషయం ఎలా చెప్పాలో తెలియక సిగ్గుపడిపోయాడు డాక్టర్ చంద్రం. చివరికి మెల్లిగా చెప్పేశాడు

'నన్ను సెలక్టు చేసుకోలేదా నాన్నా?' అడిగాడు గోపీ.

డాక్టర్ చంద్రానికి జవాబు చెప్పటం కష్టమయింది. అతను గుండె బరువుగా అయిపోయినట్లు తోచింది

'ఎందుకని నాన్నా? నాకళ్ళు చిన్నవా?'

డాక్టర్ చంద్రానికి మనసంతా అదోలా అయిపోయింది గోపీని దగ్గరకు తీసుకుని బుజ్జగించి, మాటమార్చి, తర్వాత బజారు తీసుకెళ్ళి బొమ్మలు కొని పెట్టారు.

మద్రాసులో ఒక్కక్షణం వుండాలనిపించలేదు మళ్ళీ ప్లేన్‌లో హైదరాబాద్‌కి వెళ్ళిపోదామనుకున్నాడు కాని పిడుగులాంటి వార్త, ఎయిరోడ్రోమ్ వర్కర్సంతా స్ట్రైక్‌లో వున్నారట అయిదారురోజులదాకా విమానాలు

## జాగృతి

ఉ. శ్రీ విజయంబు నేయ మము చింతలు చీకులు లేని యాంధ్రకీ
ప్రాణము లొడ్డు పుత్రులకు భాగ్యము లీ విధి బండెనా మహా
త్ములు సుసన్నుతుల్పడసి మానిత సౌఖ్యము లెల్లనో తెలం
గాణపు మూర్ఖ నేతృనయ కారుమొయిళ్ళతె గ్రమ్మె నక్కటా!

చ. తుకలకలాడ తుమ్మెదగ దోంపు ఎనాసలు గల్గ నాంధ్రులీ
నకనకలాడు నిందిరకు నాయము నెప్పక నూరకుందురే
యొకటియు లేదు ధర్మమిటు, మున్నదె యూడెకి ధర్మసూక్తులే
న్నికలు దెబ్బకొంటి మిటు నేస్తము వేరములయ్యె నక్కటా!

సీ. స్వారాజ్యసమరంబు సలిపిన భాగ్యంబు, లంతరించెనటోయి యాంధ్రులార!
ముష్కరుల్ముక్కల ముప్పతిప్పలు పెట్ట నాదరించితి మెరుగి యాంధ్రులారా!
అరవ దాయాదుల న్యాయంబులనుసైయ, ననువు లొడ్డితి మప్పు డాంధ్రలార!
ముక్కలు పుత్రులు నేడు ముప్పతిప్పలువెట్ట, ననుభవించుచునుంటి మాంధ్రులార!

ఆ.వె. విష్ణుమూర్తి నాడు వినతాంధసుల కిచ్చి
ప్రియుల కమృతమును బెట్టినట్లు
లుండ నాయమింకబండదె పాపంబు,
నోర్వలేము మూర్ఖ నోర్వలేము.

ఆ.వె. సమరమిట్లు మనము శాంతంబుతో జేయ
నచ్చలేదు కాళి మెచ్చలేదు
ఒక్క బిడ్డ వరము నొక్క బిడ్డకు ముప్పు
పక్షపాతబిడ్డ బ్రతుకునెట్లు.

ఉ. అర్లి దెయాంధ్రమాత! గనుడల్లదె యాంధ్ర మహోరథంబే
చల్లగ బోవు నూ నదవు చక్రములన్నిగు రెడ్డి లచ్చనన్
మెల్లగబంది జేసినను మేల్కొనరే మన జాతి నాయకుల్
కొల్లలు బుట్టి పేర్పడన గొన్ముల్ బట్టరె నేల తీసుచున్.

—మన్నె నాగేశ్వరరావు

ఎగిరే అవకాశంలేదు.

రైళ్ళులేవు, బస్సులులేవు.

తిరుపతినుంచి విజయవాడ బస్సులు పోవటం మొదలయిందని ఎవరో అన్నారు. అక్కడికి వెళ్ళి ప్రయత్నిద్దామనుకున్నాడు. కాని తిరుపతికి మద్రాస్‌నుంచి బస్సులు మూడురోజుల దాకా రిజర్వు అయిపోయి వున్నాయి. సీట్లులేవు. అతనికి చాలా చిరాకనిపించింది. మద్రాస్‌నుంచి బొంబాయి వైపు రైళ్ళుపోతున్నాయి. అదికూడా ఒకటి రెండురోజులక్రితంనుంచే మొదలయింది. మరునాడు ఉదయం బాంబే ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి రేణిగుంటలో దిగాడు. అక్కడ్నుంచి బస్సులో తిరుపతి చేరాడు.

తీరా అక్కడికి వెళ్ళాక తాను విన్న వార్త నిరాధారమని తేలింది. విజయవాడ రోడ్డుమీది రాకపోకలింకా మొదలు కాలేదు. రోడ్డెలావుందో ఎవరికీ వర్తమానంరాలేదు. ధైర్యంచేసి ఆరోజు ఉదయం ఒక ప్రయివేటు బస్సు వెళ్ళింది, అది నిరాటంకంగా వెడుతూన్నదో, మధ్యలో ఆగిపోయిందో ఎవరికీ తెలియదు. అటువైపునుంచి బస్సులు గానీ, కార్లుగాని ఏమీ రావటంలేదు. ఆర్. టి. సి. బస్సులు యింకో అయిదారురోజుల దాకా బయల్దేరవంటున్నారు.

బస్‌స్టాండులో ఓ టూరిస్ట్‌బస్ నిలిచి వుంది. అందులో యిరవైమందివరకూ వో గ్రూప్‌గా విజయవాడనుంచి వారం రోజులక్రితంవచ్చారుట. వాళ్ళిక్కడికి రాగానే గాలివాన మొదలయింది. దేముణ్ణయితే చూశారుగాని, అక్కడ్నుంచి కదల్లేనిస్థితిలో వుండిపోయారు. అందులో వాళ్ళు పెళ్ళి వాళ్ళు. పెళ్ళి కొండమీద చేశారు. పెళ్ళి కొడుకూ, పెళ్ళికూతురూ గాక యింకా ఆడవాళ్ళూ, మొగవాళ్ళూ, వయసు మళ్ళిన వాళ్ళూ, పిల్లలూ—అంతా వున్నారు. అనుకోనిపరిస్థితిలో యిక్కడ యిరుక్కుపోయారేమో—బాగా దిగులు పడిపోయారు. ముఖాలు పీక్కుపోయివున్నాయి. మొగాళ్ళకి గడ్డాలు పెరిగాయి.

'ఒక బస్సు వెళ్ళిందికదా. ఏమయినా సరే. యివాళ యిక్కడ్నుంచి కదలాల్సిందే' అని వాళ్ళు పట్టుబడుతున్నారు. డ్రైవరు కూడా యువకుడు. ఉత్సాహం, తెగింపు కలబోసివున్నవాడిలా కనిపిస్తున్నాడు. అతనికికూడా ఇంటి ముఖం చూసి వారం రోజులయిందేమో సాహసించేద్దామన్న ఉద్దేశమున్నట్లు కనిపిస్తోంది. 'పెళ్ళయి యింకా నెలకూడా దాటలేదు. గుర్రా కొత్తపెళ్ళాం. వారంరోజులంటే మాటలా?' అంటున్నాడు ప్రక్కనున్న ఎవరితోనో. అతనిచుట్టూ చాలామంది జనం మూగి 'బస్సు బయల్దేరుతుందా? ఖాళీవుందా?' అని ఆదుర్దాగా అడుగుతున్నారు. వాళ్ళంతా వెళ్ళటానికి దారిలేక యిక్కడ చిక్కడి పోయినవాళ్ళే.

అయిదేళ్ళ గోపీ యీ ప్రయాణంలో యిప్పటికే అలిసిపోయివున్నాడు. వాడికి యింటిరంధి పట్టింది. సినిమాలో సెలెక్టు కాలేదన్న నిజం ఆ పసిమనసుమీద గాఢమైన ముద్రవేసినట్లుంది. ముఖంలో దిగులు కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

డాక్టర్ చంద్రంకూడా ఆ జనాన్ని త్రోసుకుంటూ డ్రైవరుదగ్గరికి వెళ్ళి 'ఏమండీ! యివేళ బస్సు బయల్దేరటానికి అవకాశముందా?' అనడిగాడు మర్యాదగా.

డ్రైవరు సిగరెట్టు కాలుస్తూన్నవాడల్లా డాక్టర్ చంద్రం ముఖం వంకవో నిముషం నిదానంగా చూసి, 'అదే నేనూ ఆలోచిస్తున్నాను సార్. బయల్దేరితే వెళ్ళగలమా అని' అని సిగరెట్టు గిరవాటేసి 'మీరెక్కండి సార్ వెళ్ళిపోదాం' అన్నాడు.

మనసులో అతనికి కృతజ్ఞతలు చెప్పుకుని అలక్ష్యంచేస్తే ఆ అవకాశంకూడా దాటిపోతుందని డాక్టర్ చంద్రం గోపీతో సహా బస్సులో ఎక్కి కూర్చున్నాడు. సూట్‌కేసు కాళ్ళదగ్గర పెట్టుకున్నాడు.

ఈవార్త తెలియగానే ఆ యిరవైమంది పెళ్ళివారితోబాటు మిగతా జనంకూడా బిలబిల మనిలోపలకు జొరబడిపోయారు. ఇంకా బోలెడుమంది బయటవుండిపోయారు. ఆరునూరయినా ఓవర్‌లోడ్‌చెయ్యనని చెప్పి డ్రైవరు బలవంతంగా ఎక్కువవున్న వాళ్ళందర్నీ దింపేశాడు. చివరికి ఎలాగయితేనేం బస్సు బయల్దేరింది.

ఇరవైమంది పెళ్ళివాళ్ళు మినహా, మిగతా వాళ్ళంతా ఒకరికొకరు సంబంధించనివాళ్ళు. అందులో ఎక్కువ గుళ్ళు. బస్సు బయల్దేరగానే పీక్కుపోయిన వాళ్ళ ముఖాల్లో సంతోషం కనిపించింది. 'ఏడుకొండలవాడా! వెంకటరమణా! గోవిందా! గోవింద' అంటూ గట్టిగా ఏకకంఠంతో అరిచేశారు.

ఆయిలుకొట్టించుకోవటమయినాక బస్సు ట్రంక్‌రోడ్డుమీదకివచ్చి మెల్లగా పోసాగింది. అక్కడ రోడ్డు బాగానేవుంది.

డాక్టర్ చంద్రానికి యీ ప్రయాణం చిత్రంగా వుంది. విజయవాడనుంచి టాక్సీలో



# టూరిస్ట్ బస్

హైదరాబాద్ వెడుతున్నప్పుడు టాక్సీ చెడిపోయింది. ఫలితంగా అటుకేసి పోతూన్న వో లారీవాడిని బతిమాలి లారీలో హైదరాబాద్ చేరాల్సి వచ్చింది. ప్లేన్‌లో ప్రయాణం బాగానే సాగింది. తనకూ, గోపీకికూడా ప్లేన్ ఎక్కటం అదే మొదటిసారి. పైకి లేచేటప్పుడు తలకొంచం తిరిగినట్లనిపించినా తర్వాత సరదాగావుంది. చీకటి అవటంవల్ల క్రింద ఏమీ కనిపించటంలేదు ఎప్పుడో దీపాలువచ్చినప్పుడు తప్ప. ఎయిర్ హోస్టెస్ గోపీని లోపలకు తీసుకెళ్ళి వాడికి చాకెలెట్లూ అవీ పెట్టి కాసేపు ఆడుకుంది. ప్లేన్‌దిగాక ఎయిర్‌లైన్స్ బస్సులో మౌంట్‌రోడ్ ఆఫీసుకి వచ్చాక అక్కడ టాక్సీ దొరకటం కష్టమయింది. చివరకు రిక్షాలో బంధువులింటికి చేరాల్సి వచ్చింది. హైదరాబాద్‌నుంచి మద్రాస్ చేరటానికి ఎంతసేపు పట్టిందో మౌంట్‌రోడ్డునుంచి బంధువు లింటికి చేరటానికి అంతసేపు పట్టింది.

'మీరూ తిరుపతికివచ్చి వారం రోజులు దాటిందా?' అతని ప్రక్కనున్నతను అడిగాడు.

డాక్టర్ చంద్రం ముఖం ప్రక్కకి త్రిప్పి చూశాడు. పంచా, చొక్కా వేసుకున్నాడు. ముప్ఫయి అయిదేళ్ళుంటాయి, గడ్డం పెరిగి, కళ్ళు లోతుకుపోయివున్నాయి.

'లేదు మద్రాస్‌నుంచి వస్తున్నాను'

'అరే. నేనూ మెడ్రాస్‌నుంచేనే' అన్నాడతను. 'మెడ్రాస్ పనిమీద వచ్చాను. మా అబ్బాయికి సీరియస్ గావుందని ఫోన్‌వచ్చింది. తిరిగి వెళ్లటానికి ఏ దారిలేదు. మొన్ననగా యిక్కడికి వచ్చాను. ఇక్కడ యిరుక్కుపోయాను. ప్రొద్దుటనో బస్సు వెళ్ళింది గాని అందులో సీటు దొరకలేదు. కండక్టరుని బతిమాలుకున్నా ఎక్కించుకోలేదు. మా అబ్బాయికి ఎలావుందో ఏమిటో...' అతని ముఖమంతా విచారం అలుముకుని వుంది.

'మీరేం చేస్తూంటారు?' అని అడిగాడతనే కొంచెమాగి.

డాక్టర్ చంద్రం చెప్పాడు.

అతను పేరడిగి తెలుసుకుని 'మీపేరు విన్నానండీ పరిచయం మాత్రం లేదు' అన్నాడు. అతని పేరు సుబ్బారావుట.

డాక్టర్ చంద్రం బస్సులో వాళ్ళందర్నీ కలయజూశాడు. పెళ్లివాళ్ళ గ్రూపంతా సరదాగానే వుంది. బస్సు యింటివారి పట్టగానే వాళ్ళ ముఖాల్లో విచారం, నీరసం మాయమైనట్లుగా వున్నాయి. అంతా కబుర్లలో పడ్డారు. పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ ఒకరి మీద ఒకరు వాలిపోతూ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ కబుర్లు చెప్పేసుకుంటున్నారు. కొత్తగా పెళ్లయిన ప్రతి ఆడదీ తన మగడొక హీరో అనుకుంటుంది. ప్రతి మొగవాడు తన పెళ్ళాంలో తెలియని ఆకర్షణ వుందనుకుంటాడు. వాళ్ళు మాట్లాడే ప్రతిమాటకూ నవ్వేసుకుంటూ వుంటారు. ఇతరుల కన్న గొప్పవాళ్ళమనే గర్వం వాళ్ళ ముఖాల్లో కనబడుతూ వుంటుంది.

కండక్టరు వచ్చి తిరుపతిలో ఎక్కిన వాళ్ళదగ్గర డబ్బులు వసూలు చేస్తున్నాడు.

బయట మసక ఎక్కువవుతోంది. మళ్ళీ వర్షం వచ్చే సూచనలు కనబడుతున్నాయి. ముందు ముందు రోడ్డెలా వుందో తెలియదు. వర్షం వస్తే గొడవే.

గోపీ తండ్రి బుజం మీద తల ఆన్చి కునికిపాట్లు పడుతున్నాడు.

కొంత సేపటికి కాళహస్తి వచ్చింది. పెళ్లివారంతా బిల బిలమని దిగిపోయి గుడివైపు వెళ్లిపోయారు. మిగతా వారిలో కూడా కొందరు గుడివైపు వెళ్లారు.

డాక్టర్ చంద్రానికి చాలా అసహనంగా వుంది. 'వాళ్లందరూ యిప్పుడు వెళ్లారేమిటి?' అనడిగాడు కండక్టర్ని.

'అదంతేసార్. మా ప్రోగ్రాం ప్రకారం తిరిగి వచ్చేటప్పుడు కాళహస్తిలో ఆగాల్సి వుంటుంది. కాదనటానికి వీల్లేదు' అని బయటకు దిగి సిగిరెట్ అంటించుకున్నాడు. డ్రైవరు కూడా క్రిందకు దిగిపోయి టీకో ఎక్కడికో వెళ్లాడు.

గోపీ కళ్ళు తెరిచి దాహం వేస్తుందన్నాడు. డాక్టర్ చంద్ర కొడుకుని తీసుకుని దిగి కొంతదూరం నడిచి కూల్‌డ్రింక్ యిప్పించి తిరిగి వచ్చేసరికి దాదాపు పావుగంట పట్టింది.

సుబ్బారావు చాలా చికాగ్గా, అసహనంగా కనిపించాడు. 'డాక్టరుగారూ! వీళ్లెంత సేపటికి వస్తారంటారు?' అనడిగాడు.

డాక్టర్ చంద్రం నవ్వి 'మరి పూజాలూ అవీ కావాలి గదా' అన్నాడు.

'ఏం పూజలోనండీ, ఇలా అడుగడుక్కీ అంతరాయాలు వుంటాయంటారా?'

'నేనూ మీలాగే ఆలోచిస్తున్నాను'.

అతను ముఖం అటువైపు త్రిప్పుకుని గొణుక్కుంటున్నాడు.

అరగంట కూడా గడిచింది. వెళ్లిన వాళ్లలో మిగతావారు వచ్చేశారు పెళ్లివారింకా రాలేదు.

'వాళ్ళేరీ?' అనడిగాడు సుబ్బారావు.

'లోపల చాలా జనం వున్నారండీ. వాళ్ళు పెద్ద పెద్ద పూజలేవో చేయిస్తున్నారు' అన్నాడు అందులో ఒకడు.

సుబ్బారావు నిస్పృహగా 'సరే!' అన్నాడు.

గోపీ కూడా 'తోచటం లేదు నాన్నా' అంటున్నాడు మధ్య మధ్య.

ప్రయాణం చేస్తున్న వాళ్ళలో స్టూడెంట్లలా కనిపిస్తూన్న యిద్దరు స్నేహితులు కూడా వున్నారు. వాళ్ళు గుళ్ళోకి వెళ్లకుండా బస్సులోనే కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. ఇంత సేపూ పట్టించుకోలేదుగాని, అరగంట దాటేసరికి వాళ్ళకి కోసం వచ్చింది. 'బస్సంతా వాళ్ళ తాతగారి సొత్తనుకున్నారా?' అవతలింకా చాలా మంది వెయిట్ చేస్తున్నారన్న యింగితజ్ఞానం వుండద్దూ?' అంటూ తిట్టటం ప్రారంభించారు.

మరో పావుగంటకి కూడా వాళ్ళు రాకపోయేసరికి కండక్టర్ చూసి వస్తానని వెళ్లాడు. చూసి వస్తానని వెళ్లినవాడు అరగంట దాకా పత్తాలేడు.

బస్సులో వాళ్లు విసుక్కోవటం, తిట్టుకోవటం ఎక్కువయింది.

చివరకు కండక్టర్ వచ్చాడు. 'వచ్చేస్తున్నారు లెండి' అన్నాడు తన మీదకు ప్రశ్నల వర్షం కురవకుండానే.

అతను వచ్చేస్తున్నారని చెప్పిన పావుగంటకి పెళ్లివారు తాపీగా ఒకరొక్కరే రాసాగారు.

స్టూడెంట్లు వాళ్ళమీద విరుచుకు పడ్డారు.

'అలా విసుక్కుంటే ఎలాగండీ మేము వచ్చిన పని కావద్దూ?' అన్నాడు అందులోనో పెద్దాయన.

'బస్సంతా మీరే రిజర్వ్ చేసుకుంటే మీ

(42వ పే. చూడండి)

ప్రకారం గుళ్ళూ గోపురాలూ తిరగొచ్చు. పైవాళ్ళ కూడా వున్నారన్న ఆలోచన వుండాలికదా' అన్నాడు స్టూడెంట్సులో ఒకడు.

'అంత ఆలోచన మాకు లేకపోలేదు గాని, ఆగుళ్ళోవాళ్ళకి వుండొద్దంటం ఏ? యిదేమన్నా మన యిల్లా యిష్టప్రకారం జరగటానికి?'

'జరక్కపోతే మానుకుని వచ్చెయ్యాలి.'

'ఇంత కష్టపడి ప్రోగ్రాం ఏర్పాటు చేసుకుని మానుకోవటానికి మాకేం పట్టిందండీ?'

ఇలా వాగ్వివాదం పెరిగేలావుంది.

కండక్టర్ వాళ్ళకి నర్ది చెప్పి 'కాస్త ఎడ్జస్టుచేసుకోండి సార్. ఎడ్జస్టుచేసుకోండి ...ఏమండీ అంతా ఎక్కారా?' అన్నాడు.

'ఇంకాలేదు' అన్నారెవరో.

దూరంగా వో కూల్‌డ్రింక్ షాపుదగ్గర పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ వయ్యారంగా నిలబడి డ్రింక్సు త్రాగుతూ కనిపించారు. వాళ్ళ ధోరణి చూస్తే వాళ్ళు ఒక ప్రయాణం చేస్తున్నట్లుగానీ, వాళ్ళకోసం చాలామంది నిరీక్షిస్తున్న విషయం పట్టించుకున్నట్లుగాని కనబడటంలేదు. ఈ భూమ్మీద మనం మనగురించే పుట్టాం అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు.

వాళ్ళని చూసి సుబ్బారావుకు వళ్ళు మండిపోయి పళ్ళు కొరుక్కుంటున్నాడు.

చివ్వరికి వాళ్ళు డ్రింకులు త్రాగటం ముగించి, నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూ బస్సుదగ్గరకువచ్చారు. స్టూడెంట్సు వాళ్ళ వంక కొరకొరా చూశారు. పరిస్థితులు చూస్తే వాళ్ళు కయ్యానికి కాలు దువ్వేటట్లే లేవో అనిపించింది. కాని ఏమనుకున్నారో ఏమిటో తమాయించుకుని ఊరుకున్నారు...

బస్సు కదిలింది.

అక్కడినుంచి రోడ్డు అధ్వాన్నంగావుంది. గాలివాన తాలూకు భీభత్సం అడుగడుగునా కొట్టొచ్చినట్లు కనబడుతోంది. రోడ్డు గతుకులమయం. చిన్నచిన్న గతుకులు కాదు. పెద్ద పెద్ద గోతులతో రోడ్డంతా నిండిపోయివుంది. అటూయిటూ ఊబిలా పేరుకుపోయింది. పొరపాటున బస్సు రోడ్డుప్రక్కకి వెళ్ళినట్లయితే పల్లంగావున్న ఆ ఊబిలో దిగబడిపోతుంది. తర్వాత బస్సులోనివారంతా దిగి తోసినా. ఆఖరికి క్రేన్సువచ్చి లాగినా

# టూరిస్ట్ బస్

(24 వ పేజీ తరువాయి)

ఆ బస్సును అక్కడినుంచి కదిలించటం కష్టం. రోడ్డుకు యిరువైపులా వున్న పొలాలు పూర్తిగా జలమయమైపోయి అంచు కనిపించని సముద్రంలా గోచరిస్తున్నాయి. ఎవరో, ఎటుపోతున్నారో అర్థంగాకుండా మధ్యమధ్య రోడ్డుమీద తారసిల్లే మనుషులు, వీరుడిలా దూసుకుపోతున్న యీ వొంటరి బస్సువంక చిత్రంగా చూస్తున్నారు. బస్సు డ్రైవరు తెలివిగా, నెమ్మదిగా, చాకచక్యంగా బస్సుని నడిపిస్తున్నాడు. ఎంత జాగ్రత్తగాపోతున్నా రోడ్డుమీద గతుకులకు బస్సు వువ్వట్లుండి ఎగిరిపడేస్తోంది. ఆ కుదుపులకు లోపలజనం ఒకరిమీద ఒకరు పడిపోతున్నారు.

క్రమంగా సాయంత్రం గడిచి చీకటి ముసురుకుంటోంది.

బస్సులోనివారంతా లోకాభిరామాయణంలో వున్నారు. పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ యీ లోకాన్ని యిప్పుడిప్పుడే గమనించే స్థితిలో లేరు. స్టూడెంట్సుద్దరూ గట్టిగా మాట్లాడుకుంటున్నారు — మధ్య మధ్య అసభ్యమైన మాటల్ని ప్రయోగిస్తూ. కొంతమంది నిద్రకాపుకోలేక జోగుతూ, మధ్యమధ్య ప్రక్కవాళ్ళమీద పడుతూ, మళ్ళీ సర్దుకు కూర్చుంటున్నారు.

సుబ్బారావుకు విసుగుదల ఎక్కువైపోతోంది. వాళ్ళ అబ్బాయి అల్లరిగురించీ, ఆటపాటలగురించీ, చురుకుతనం గురించీ, డాక్టర్ చంద్రానికి అదేపనిగా చెబుతున్నాడు. మధ్యమధ్య—'సరిగ్గా మీ అబ్బాయి వయస్సే వుంటుందండీ' అంటాడు.

ఒకచోట రోడ్డు మరీ ధ్వంసమైపోయి వుంది. అడ్డంగా రోడ్డువున్నంతమేరా భూకంపంవస్తే చీలిపోయినట్లు వో గొయ్యి వ్యాపించి వుంది. చీకట్లో చూసుకోకుండా ముందు వెళ్ళిపోయినట్లయితే పెద్ద ప్రమాదం జరిగి బస్సు తల్లక్రిందులయిపోయివుండేదే. లైట్ల వెలుగులో సరిగ్గా కనిపించకపోయినా డ్రైవరు జాగ్రత్తగా పసిగట్టి బస్సాపేశాడు. డ్రైవరు క్రిందకి దిగగానే అతనితోపాటూ అందరూ దిగారు. చాలా పెద్దగొయ్యి. అది చూసి అంతా హతాశులైపోయారు. అందరూ డ్రైవరు ముఖంకేసి ఆతృతగా చూస్తున్నారు.

'ఎలా? బస్సు పోదా?' అంటున్నాడు సుబ్బారావు, ముఖం వాడిపోగా.

'లాభంలేదు' అన్నట్లు డ్రైవరు తలాడించాడు.

'ముందు వెళ్ళిన బస్సు ఎలా వెళ్ళి వుంటుంది?' అని ఒకాయన ప్రశ్నవేశాడు.

అదే డ్రైవరుకూ అర్థంకాలేదు. ఆ డ్రైవరు ఏం మాయచేసి వుంటాడు? బస్సు లైట్లు వెలిగించి, ఆ వెలుగులో నేలంతా పరీక్షచేసి చూశాడు. రోడ్డుపై గోతి మీదుగా ఏదో పరచినట్లు ఆనవాలు కనిపించింది.

'ఆ బస్సులో బలమైన చెక్కలేమైనా వుండివుంటాయి. లేకపోతే దగ్గర వూరి నుంచి తీసుకొచ్చయినావుంటాడు. అవసరం గడవగానే ముందు ముందు పనికివస్తాయని బస్సులోనే వేసుకు పోయివుంటాడు' అన్నాడు ఆలోచించి—

'దగ్గర్లో ఏదయినా ఊరుందా?' అని అడిగారెవరో.

'నాలుగైదు ఫర్లాంగుల దూరంలో వుండవచ్చు. కాని ఈ చీకట్లో దారెలా తెలుస్తుంది? ఏటుచూసినా బురద, ఊబి. సాహసించి వెళ్ళినా ఎక్కడో అక్కడ దిగబడిపోవటం తథ్యం.'

అందరికీ గుండెల విసిపోయాయి.

'మరెలా?'

'వెనక్కి వెళ్ళిపోవటమే.'

'ఏదో ఆలోచన వచ్చి డాక్టర్ చంద్రం అన్నాడు. 'ఈ గోతిని మట్టితో పూడ్చగలమా?'

ఊహారు కండక్టరు కలగచేసుకున్నాడు. 'అవకాశం లేకపోలేదు. కాని ఒకళ్ళవల్లా యిద్దరివల్లా కాదు. అంతా తలో చెయ్యి వేస్తే...?'

అందరికీ ఉత్సాహం వచ్చింది. పట్టుదలకూడా పెరిగింది. అందరూ సైఅంటె సై అన్నారు ఆడవాళ్ళనూ, పిల్లలనూ బస్సులో కూర్చొబెట్టారు. చీకట్లో ఏమీ తెలియదని బయటిలైట్లు ఆర్పేసి బస్సులోని లైట్లు వెలిగించి వుంచారు. డాక్టర్ చంద్రం ప్యాంటు మోకాలిదాకా పైకి మడిచాడు.

పెళ్ళికొడుకు ఈ లోకంలోకి వచ్చి

# టూరిస్ట్ బస్

జనంలో కలవటానికి ముందు తటపటాయించాడు. కాని, అవకాశం కోసం ఎదురు చూస్తూన్న స్టూడెంట్లు ఒకపట్టున పట్టేటట్లు కనిపించారు. పెళ్ళికూతుర్ని విడవలేక విడవలేక క్రిందకి దిగాడు. దిగుతూ ఆమె కళ్ళలోకి చూశాడు. తర్వాత ముందుకు నడిచి ప్యాంటు పైకి మడుచుకోబోయాడు. అది టైట్ ప్యాంటేమో నసేమిరా కదలనంది. అలాగే వుంచేసి విసుక్కుంటూ జనంలో కలిశాడు

రోడ్డు ప్రక్కనున్న తడిమట్టిని తీసుకొచ్చి గోతిని పూడ్చేస్తున్నారు. గట్టిగా వుండేందుకు మధ్యమధ్య కాళ్ళతో మర్దిస్తున్నారు. అందరి బట్టలూ, శరీరాలూ మట్టిమయమైపోయాయి. చేతులతో గబగబా పోసేస్తున్నారు అందరికీ చెమటలు పడుతున్నాయి. ...బస్సు కిటికీలోంచి గోపి చీకట్లో మసగ్గా కనిపిస్తూన్న ఈ దృశ్యాలను ఆసక్తిగా చూస్తున్నాడు,

గొయ్యి పూడటానికి గంటన్నర పైగా పట్టింది. తెలియకుండానే కాలం గడిచిపోయింది. అందరి శరీరాలూ అలిసిపోయాయి. డ్రైవరూ, కండక్టరూ కూడా బాగా కష్టపడ్డారు.

'ఇహ చాలు ఆపండి. ఒక్కసారి బస్సులోంచి మిగతావారు కూడా దిగండి. బరువెక్కువయితే గోతిలో చక్రాలు కూరుకుపోతాయి' అని హెచ్చరించాడు డ్రైవరు.

బస్సులోంచి మిగతా ప్రయాణీకులు కూడా దిగిపోయారు. గోపివచ్చి తండ్రి ప్రక్కన నిల్చున్నాడు.

డ్రైవరు బస్సులో ఎక్కి స్టార్టు చేశాడు. వెనకనున్నవాళ్ళని అడ్డులెమ్మని అరిచి రివర్సులో యిరవైగజాలు పోనిచ్చి, గేరు మార్చుకుని మళ్ళీ ముందుకు వేగంగా పోనిచ్చాడు. బస్సు గోతిమీదుగా సర్రున సాగింది.

అయినా ప్రయోజనం లేకపోయింది ముందుభాగం బాగానే వెళ్ళిపోయిందిగాని వెనుక చక్రాలు తడిమట్టిలో కూరుకుపోయి, చక్రాలు గిర్రున తిరిగిపోతున్నాయి గాని బస్సు ముందుకు పోవటంలేదు. పైగా డ్రైవరు యాక్సిలరేటర్ గట్టిగా నొక్కిన కొద్దీ తిన్నగా వున్నది కాస్తా ప్రక్కకి తిరిగిపోతోంది. ఇంకా కొంచెం అలానే తిరిగిందంటే రోడ్డుకు పూర్తిగా అడ్డంపడిపోయి, ఊబిలోకి వెళ్ళిపోవచ్చుకూడా.

డ్రైవరుకు ముచ్చెమటలు పోశాయి. యాక్సిలరేటర్‌మీద కాలుతీసి. 'అందరూ సాయంపట్టి తోసెయ్యండి గట్టిగా తొయ్యాలి' అని అరిచాడు తల బయట పెట్టి.

అందరూ బస్సువైపు కదిలారు కొందరు వెనకా, కొందరు యిరుప్రక్కలా చేరారు డ్రైవరు లోగేరలో వేసుకుని యాక్సిలరేటర్ గట్టిగా నొక్కాడు అందరూ కలిసి అదే సమయానికి శక్తినంతా ఉపయోగించి ముందుకు తోశారు. అదృష్టం బాగుంది, బస్సు గోతినిదాటి ముందుకు వెళ్ళిపోయింది.

గోపి తండ్రి చెయ్యిపట్టుకున్నాడు అంతా ఉత్సాహంతో గొయ్యిదాటి వెళ్ళిపోయి బస్సెక్కి ఎవరిస్థానాల్లో వాళ్ళు కూర్చున్నారు కొందరు 'గోవిందా గోవింద' అని బిగ్గరగా అరిచారు.

బస్సు కదిలింది

తర్వాత నెల్లూరుదాకా కుదుపులతో, ఎగిరెగిరి పడటంలో పైరాన తప్ప ఆటంకమేమీ కలగలేదు నెల్లూరు చేరేసరికి పది దాటిపోయింది ఆ ప్రయాణీకులంతా ఆకలితో ఆవురావురు మంటున్నారు డ్రైవరు ఒక హోటలుముందు బస్సాపాడు 'అంతా వెళ్ళి భోజనాలు చేసిరండి' అని చెప్పాడు

గబగబా ప్రతివారూ లోపల దూరారు— స్టూడెంట్స్ గ్రూపూ తప్ప 'మేము మెయిన్ రోడ్డులోకిపోయి భోంచేసి వస్తాం. అక్కడ మంచి హోటళ్ళున్నాయి' అన్నాడు వాళ్ళలో ఒకడు


కండక్టర్ తలూపి 'అలాగే తొరగా వచ్చెయ్యండి' అన్నాడు.

స్టూడెంట్లు మెయిన్‌రోడ్డువైపు సాగిపోయారు

మిగతా ప్రయాణీకులతోబాటు డాక్టర్ చంద్రం డ్రమ్ములోని నీళ్ళతో మట్టిచేతుల్ని శుభ్రంగా కడుక్కుని లోపలకు వెళ్ళి గోపితో ఒకచోట కూర్చున్నాడు సుబ్బారావు విస్తరి ముందు కూర్చున్నాడుగాని అన్నం కెలికి పారేస్తూ ఒకటే గొణుక్కుంటున్నాడు. ఒక్కొక్క గంట గడిచిన కొద్దీ మనిషిలో పిచ్చివాలకమెక్కుతోంది పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ ఫ్యామిలీరూంలో దూరారు. స్పెషల్‌గా స్వీట్లేదో ఆర్డరిచ్చినట్లున్నారు. సర్వర్ రెండు ప్లేట్లలో, లోపలకు పట్టుకెళ్ళాడు లోపల్నుంచి మధ్య మధ్య నవ్వులు వినిపిస్తున్నాయి

హోటల్లోని మిగతావారు బస్సులో వచ్చిన ప్రయాణీకుల్ని దారిలోని అనుభవాల్ని గురించి వింతగా అడుగుతూంటే వాళ్ళు భోజనాలు చేస్తూ విపులీకరిస్తున్నారు.

ఇరవై నిమిషాలలో మళ్ళీ అందరూ బస్సులో వున్నారు. కండక్టరు 'అంతా ఎక్కారా?' అని గట్టిగా అరిచాడు. ప్రతి



వాడూ పక్కకి తిరిగి చూసుకున్నాడు. చివరకు స్టూడెంట్లెవ్వరూ లేరని తేలింది.

'అరె! వీళ్ళింకా రానట్టు గావుందే' అన్నాడు కండక్టర్,

సుబ్బారావు గొణుగుడు తీవ్రంగా మారింది.

అరగంటయింది. ముప్పావుగంటయింది. స్టూడెంట్లు పత్తా లేరు,

బస్సులో వ్యాఖ్యానాలు ఎక్కువయాయి. 'ఒకరిద్దరికోసం బస్సాపటమేమిటి?' 'ఇది వాళ్ళ సొత్తనుకున్నారా?' 'ఇందాక వాళ్ళు ఆలశ్యంచేశారని వాళ్ళు కావాలని మిశ్చిఫ్ చేస్తున్నారండీ' 'కండక్టరుగారు ఏమయితే ఏమయింది. మీరు పోనిచ్చేయండీ' యిలా అంటున్నారు.

కండక్టరు ఒకటేమాటమీద నిలబడ్డాడు 'తిరుపతిలో ఎక్కిన ప్రతి ప్యాసెంజరూ బస్సులోలేనిదే బస్సు కదలటానికి వీల్లేదు' అని.

పెళ్ళివారుమాత్రం 'కానివ్వండి. అయిన ఆలశ్యం ఎలాగా అయింది. వాళ్ళ పనులు చూసుకునే రానివ్వండి' అంటున్నారు స్పోర్టివ్‌గా తీసుకున్నట్లు.

మరో అరగంట గడిచాక స్టూడెంట్లు—ఖుషీగా కిల్లీలు నములుతూ, జల్సాగా కబుర్లు చెప్పుకుంటూ సాక్షాత్కరించారు.

'ఏమిటిసార్! యింత ఆలస్యం చేస్తే ఎలా?' అన్నాడు కండక్టర్.

'ఏం చెయ్యమండి? వెడుతూంటె దార్లో ఓ గుడి కనిపించింది. మావాడు దైవభక్తుడు. గుళ్ళోదూరి పూజలూ, పునస్కారాలు చేయందే నిలవలేకపోయాడు. తర్వాత హోటలుకు వెళ్ళాక ఆకలి మీద వున్నామేమో చికెన్ తినాలనిపించింది. మా వాడు జింజర్ చికెన్ కావాలన్నాడు. మరి అది తయారుచేసి తీసుకు రావాలా, మేము తినాలా?' అన్నాడు అందులో ఒకడు.

సుబ్బారావు ఉగ్రరూపం ధరించి దెబ్బలాటకు సిద్ధం కాబోతున్నాడు. డాక్టర్ చంద్రం అతన్ని చెయ్యిపట్టుకు ఆపి, వారించాడు.

మిగతా వాళ్ళుకూడా ఉద్రేకాలను అణచుకుని, మౌనంగా ఊరుకున్నారు.

డ్రైవరు సిగరెట్ అవతలపారేసి సీటులోకి వచ్చాడు బస్సు కదిలింది.

రోడ్డు మరీ గోతులమయంగా వుంది, ఉన్నట్లుండి ఎత్తి పడేస్తోంది. ఒకళ్ళమీద ఒకళ్ళుపడిపోయి, మళ్ళీ సర్దుకు కూర్చోటం బ్రహ్మప్రళయమైపోతోంది.


ఓ అరగంట గడిచివుంటుంది. బస్సు ఒక పెద్ద గోతిలోపడి, పెద్ద కుదుపుతో లేచింది. వెంటనే 'అమ్మో!' అన్న కేక వినబడింది.

ఆ కేక వెనక సీట్లోంచివచ్చింది. బస్సు ఎత్తి కుదేయగానే ఆ సీటుమీద కూర్చున్న ఓ స్త్రీ అమాంతం పైకి ఎగిరిపడటం, తిరుపతిలో చేయించుకున్న ఆమె గుండుకు పైన వున్న సామాన్లలోంచి క్రిందకి పొడుచుకొచ్చిన ఓ యినప గరిటె బలంగా గుచ్చుకోవటం, ఆమె 'అమ్మో' అని కేకేయటం, ఫెయింటయి క్రిందపడటం అన్నీ గబగబ జరిగిపోయాయి.

'ఆపండి, బస్సాపండి' అని ఆమె భర్త ఆవేశంగా అరుస్తున్నాడు. అతను అయిదారు కేకలు పెడితేగాని, అది డ్రైవరుకు చేరటం, ఆపటం జరగలేదు. ఏం జరిగిందో అని అంతా ముందుకు వొంగిచూస్తున్నారు. ఏం జరిగిందో అర్థమయింది.

బస్సులో డాక్టరున్నాడని కొంతమందికి యిదివరకే తెలిసింది. 'డాక్టరుగారూ కొంచెమిలా వచ్చి చూడండి. ప్లీజ్' అని ఎవరో పిలిచారు.

డాక్టర్ చంద్రం లేచి ఆ యిరుకులోంచి జనం కాళ్ళని దాటుకుంటూ లోపలికి వెళ్ళాడు. ప్రక్క సీట్లోని వాళ్ళంతా పడిపోయిన ఆమెచుట్టూ మూగి చోద్యం చూస్తోంటే 'ఆమెకి గాలి రానివ్వండి, ప్రక్కకి తొలగండి' అన్నాడు. వాళ్ళు



పక్కకి తప్పుకుని డాక్టరుకి దారిచ్చారు.

అతడు ఆమె చెయ్యిపట్టుకుని పల్సు చూస్తున్నాడు. ఆమె భర్త ఉద్రేకంగా 'రోడ్డు బాగుండకపోతే అంత స్పీడ్‌గా ఎందుకు పోనివ్వాలి? అంత పొగరుగా ఎందుకు పోనివ్వాలి...? రండి డాక్టరు గారూ రండి. మా ఆవిడ్ని బ్రతికించండి. ఇంజక్షన్లివ్వండి. ఏం కావాలో అన్నీ చేసెయ్యండి' అంటున్నాడు.

డాక్టరయినంత మాత్రాన అన్నివేళలా, అన్ని సందర్భాలలోనూ అస్త్రశస్త్రాలతో సిద్ధంగా వుంటాడా? అనుకుంటున్నాడు డాక్టర్ చంద్రం.

అతని దృష్టి ఆమె గాయం వైపు మళ్ళింది. నున్నని ఆమె గుండెకు బలమైన దెబ్బ తగిలిందేమో, అప్పటికప్పుడు పెద్ద బొప్పి కట్టేసింది.

గోపీ నిద్రలేచి తండ్రివెనక ఈ దృశ్యం చూడటానికి ఎప్పుడు వచ్చాడో ఏమో. 'గుండుమీద గుండు. బలే' అన్నాడు.

బస్సులో వున్నవాళ్ళంతా ఈ మాటకు నవ్వకుండా వుండలేకపోయారు.

'మా ఆవిడ దెబ్బతగిలి పడిపోయివుంటే మీరంతా నవ్వుతారా? ఆవిడకి తెలివిరాన్దే బస్సు కదలటానికి వీల్లేదు. ఆఁ' అని భర్త అరిచాడు కోపంగా.

అది కేవలం ఫెయింటవటమేనని, ప్రమాదమేమీ లేదని అతనికి నచ్చచెప్పి నీళ్ళకోస మడిగి, ఎవరో మరచెంబుతో నీళ్ళందిస్తే ముఖంమీద జల్లాడు. పడిపోయినావిడ ఒకసారి అటూ యిటూ కదిలి, తర్వాత మూలిగి కళ్ళు విప్పింది. 'ఏమమ్మా ఎలా వున్నదని అడిగితే తలనొప్పిగా వున్నట్లు సూచించింది. ఫర్వాలేదనిచెప్పి ఆవిడ్ని కాసేపు పడుకుని వుండటానికే చోటు చెయ్యమనిచెప్పి డాక్టర్ చంద్రం యివతలకు వచ్చేశాడు.

బస్సు మళ్ళీ కదిలింది.

ఈసారి మరింత మెల్లిగా, జాగ్రత్తగా పోతోంది. అయినా రోడ్డేమీ బాగాలేదు. ఎక్కడికక్కడ అవరోధాల్ని తప్పించుకుంటూ పోతున్నట్లు, పోవల్సి వస్తోంది.

మరో రెండుగంటలు ఏ ఒడుదుడుకూ లేకుండా ప్రయాణం సాగింది.

ఇంతలో వర్షం కురవటం మొదలు పెట్టింది. పెద్ద వర్షమే. నీళ్ళు లోపలకు పడుతున్నాయి. కిటికీలదగ్గరున్న తెరలన్నీ క్రిందికి దింపేసి తాళ్ళతో గట్టిగా కట్టేశారు.

ఇంచుమించు ప్రతివారికీ నిద్రముంచు కొస్తోంది. టైము రెండు కావస్తోంది. వెనక్కి ఆనుకుని కొందరూ, ప్రక్కకి వొరిగి కొందరూ కునికిపాట్లు పడుతున్నారు.

మరో ముప్పావుగంట గడిచింది.

ఉన్నట్లుండి బస్సాగిపోయింది.

వెంటనే చాలామందికి మెలకువ వచ్చేసింది. ఏం జరిగిందోనని? ఆలోచిస్తున్నారు. 'ఏమయింది గురూ?' అనడిగాడు కండక్టరు డ్రైవర్ని.

'ఏరొచ్చేసింది గురూ. చాలా పెద్దదిలా కనిపిస్తోంది.'

అందరూ ఉలికిపడ్డారు. డ్రైవరు, కండక్టరుతోబాటు వానలో తడుస్తూనే చాలామంది క్రిందికి దిగారు.

డ్రైవరు హెడ్ లైట్లు వెలిగించి వుంచాడు. ఒంగోలు సమీపప్రాంతం. బహుశా యిక్కడ చాలా సేపట్నుంచి వర్షం పడుతూ వుండాలి. మొదటి బస్సు వెళ్ళి పోయేటప్పటికి వానలేకపోబట్టి ఏరు వచ్చి వుండదు. ఒక అరఫర్లాంగు పొడవున ఏరు ప్రవహిస్తూ కనిపించింది. నీళ్ళ చప్పుడు వింతగా వినిపిస్తోంది. ప్రవాహవేగం ఎక్కువగా లేదుగాని, లోతెంతవుందో తెలియదు.

'ఇప్పుడేం చేద్దాం' అన్నాడు సుబ్బారావు బలహీనమైన గొంతుతో.

'ఎంత లోతుందో. వర్షం తగ్గుముఖం పట్టిందనుకోండి. అయినా ఏరుదిగి పోవాలంటే అయిదారుగంటలు పడుతుంది' అన్నాడు డ్రైవరు.

ప్రయాణీకులందరికీ ఎక్కడలేని నిస్పృహ వచ్చేసింది. అందరూ నీరసపడిపోయారు.

డ్రైవరుకూడా ఈవర్షాన్ని తిట్టుకుంటున్నాడు. ముందుకు నడిచి నీళ్ళల్లో దిగి కొంతదూరంపోయాడు. మోకాళ్ళు మునిగాయి. ముందు ముందు యింకా లోతు వున్నట్లు పొడగట్టింది.

'ఏంచేద్దా మేంచేద్దామన్న తర్జన భర్జనలతో మరో అరగంట గడిచిపోయింది.

చివరకు డ్రైవరు తేల్చి చెప్పాడు. 'ఏరు తగ్గాలంటే తెల్లవారేదాకా యిక్కడ కాపలా కాస్తూ వుండాల్సిందే. రిస్కు తీసుకుని పోవాలంటే పోవచ్చు కాని రిస్కు రిస్కే. ఇంజను లోపలకు నీళ్ళుపోతే బస్సు మధ్యలో ఆగిపోవచ్చు. అప్పుడంతా దిగి తోయాల్సి వుంటుంది. ఇంజను తడిస్తే, ఆ తడంతా ఆరి బయల్దేరటానికి అయిదారుగంటలు పడుతుంది. అలాగాకుండా లోపలి డెల్కోలకు తడవకుండా గుడ్డచుట్టేసి, యింజను స్టార్టుచెయ్యకుండా మొదట్నుంచీ త్రోసుకుంటూపోతే యింజన్ పాడవదు. అదీ సంగతి.

ప్రయాణీకులంతా ఓ పదినిమిషాలు చర్చించుకున్నారు. ప్రతివారిలోనూ త్వరగా యిల్లు చేరాలన్న తహతహ. ఇక్కడవుండే ప్రతిక్షణంకూడా నరకంగా వుంది. అందరూ అసహనంగా వున్నారు. ఎలాగైనా సరే వెళ్ళి పోవాలని పట్టుదల. సమాలోచించుకొనటం అయ్యాక 'అలాగే తోస్తాం. యింజన్ స్టార్టు చెయ్యకండి' అన్నారు.

ప్రయాణీకుల్లో ఎవరిదగ్గరో తినుబండారాలు తెచ్చుకున్న బొంతు ఆయిలు క్లాత్ దొరికింది. డ్రైవరు బాయ్‌నెట్ యెత్తి ఆయిల్‌క్లాత్ దేనికో బిగించి చుట్టాడు. ఆడవాళ్ళు, పిల్లలూ తప్ప అంతా దిగిపోయారు - పెళ్ళి కొడుకుతోసహా. 'రెడీ' అన్నారు డ్రైవరు లోపలలైట్లు, హెడ్‌లైట్లుకూడా వెలిగించి వుంచాడు— దారి తెలియటానికి. అందరూ బస్సుమీద చేతులు వేశారు, బలంగా తొయ్యసాగారు. బస్సు బరువుగా కదిలింది.

కొస్త కొస్త, కొస్త కొస్త చొప్పున బస్సు ముందుకు సాగుతోంది. మోకాళ్ళు మునిగిపోతున్నాయి. పట్టుదొరకటం కష్టంగా వుంది......మోకాళ్ళుదాటి నీళ్ళు పైకి వచ్చాయి. బస్సు బ్రిడ్జికి మధ్యగాపోకుండా, పొరపాటున ప్రక్కకి దిగిందా, వల్లంలో దిగిపోయి, యిహ బ్రహ్మవచ్చినా కదపటానికి వీల్లేదు. ఆ దిగటం, మరికొంచం ఎక్కువగా జరిగితే లోయలో పడిపోయి తలక్రిందులవటానికి కూడా అవకాశం వుంది.

అరగంట గడిచినా యింకా సగందూరమైనా రాలేదు. బలం సరిపోకపోవటంవల్ల మధ్య మధ్య ఆగిపోవల్సి వస్తోంది. మళ్ళీ శక్తి పుంజుకుని ఎక్కడలేని సత్తువా తెచ్చుకుని తొయ్యటం మొదలు పెడుతున్నారు.

# టూరిస్ట్ బస్

మధ్యవరకూ వచ్చేసరికి లోతెక్కువగా వుంది.

పాదాలు నీళ్ళలో తడబడుతున్నాయి. ఒక్కోసారి జారిపోతున్నాయి.. సుబ్బారావు బలమంతా ఉపయోగించి తొయ్యబోయి పట్టుజారి నీళ్ళలో దబీమని పడ్డాడు. ప్రక్కనేవున్న డాక్టర్ చంద్రం చప్పున అతన్ని లేవదీశాడు

'దెబ్బ తగిలిందా?' అనడిగాడు సాదరంగా

'లేదులెండి' అన్నాడు సుబ్బారావు మూలుగుతూనే.

'పోనీ మీరువెళ్ళి బస్సులో కూర్చోండి. ఓపిక లేకపోతే ఏం చేస్తారు?'

'పర్వాలేదులెండి. ఇంకెంత? వచ్చేశాంగా' అంటూ మళ్ళీ చెయ్యి సాయం పట్టాడు.

ఎలాగైతేనేం, అందర్నీ రక్తం పిండేంత పని చేశాక బస్సు అవతలి ఒడ్డు చేరింది. ప్రతి ఒక్కరికీ శక్తి ఉడిగిపోయినట్లయింది. తడిసి ముద్దయిపోయారు. అడుగుతీసి అడుగు వెయ్యలేని స్థితిలో పడిపోయారు. ప్రతివారూ ప్రాణంలేనట్లు కనిపిస్తున్నారు

డ్రైవరు సీట్లోకియెక్కి యింజన్ స్టార్ట్‌చేసి చూశాడు. స్టార్టయింది 'ఎక్కండి ఎక్కండి' అని కేకలేశాడు ఉత్సాహంగా.

అంతా బస్సెక్కి వివరి సీట్లో వాళ్ళు కిటప్పవాళ్లా కూర్చున్నారు. బస్సు కదిలింది.

మళ్ళీ ప్రయాణం, మళ్ళీ గోతులు, మిదువులు. చిన్నచిన్న ఏర్లు అడ్డువచ్చాయి కాని, బస్సు వాటిని తేలిగ్గా దాటేస్తూ పోయింది.

ముందు ముందు ఏరులు లేవన్నాడు కండక్టరు... 'అమ్మయ్య!' అనిపించింది.

ఓ అరగంట గడిచింది. అలిసిపోయివున్న శరీరాలకు మంచి నిద్ర పట్టేసింది. తమ ప్రాణాలను డ్రైవరు చేతిలోపెట్టేసి నిద్రలో పడిపోయారు.

ఉన్నట్టుండి పెద్ద బ్రేకుతో బస్సాగిపోయింది. పెద్ద కుదుపు. ముందుకు తూలిపడినట్లయి ప్రతివాడూ ఉలిక్కిపడి లేచారు. ఏదో జరిగినట్లు అందరికీ బోధపడింది. కాని ఏమిటది? 'ఏం జరిగింది?' 'ఏం జరిగింది?' అని వాళ్ళలో వాళ్ళు ప్రశ్నించుకుంటున్నారు.

గబగబ బస్సుదిగ్గి ముందుకెళ్ళారు.

అప్పటికే డ్రైవరూ, కండక్టరూ దిగి లైట్ల వెలుగులో నెత్తురులేని ముఖాలతో చూస్తున్నారు.

ఎవరో, ఆ రాత్రి సమయంలో, ఆ నిర్జనప్రదేశంలో ఎందుకు నడుస్తున్నాడో, ఎక్కడికి పోతున్నాడో, అతనే చూసుకోలేదో, డ్రైవరు ఏమరిపాటున మీదకి ఎక్కించాడో ముందు చక్రాలక్రింద పడి తుక్కుతుక్కయి వున్నాడు తల పగిలిపోయింది. శరీరం ముద్దయిపోయి వుంది. కొద్దిగా రక్తం నేలమీద కారుతోంది.

అందరికి గుండెలవిసిపోయాయి.

తర్వాత...

గుసగుసలు చర్చలు, తర్జనభర్జనలు, ప్రశ్నలు, సమాధానాలు...అందరికీ మతులు పోయాయి.

ఏం జరుగుతుంది? ఏం జరుగుతుంది?

చివరకు డ్రైవరూ, కండక్టరూ విడమర్చి చెప్పారు 'బస్సు యిక్కడ వుండిపోయింది. తెల్లవారుతుంది. పోలీసులకి కబురు. వాళ్ళు రావటం, ఫోటోలు తియ్యటం, సాక్ష్యాలు, సంతకాలు.

సుబ్బారావు మతి చలించినట్లు కేకలేస్తున్నాడు.

అందరూ గబగబ సమాలోచించుకుంటున్నారు. 'వీల్లేదు.' 'యిహ యిక్కడ వుండలేం.' 'యిప్పటికే ప్రాణాలు పోతున్నాయి' 'అర్ధరాత్రివేళ జరిగిన యాక్సిడెంటు ఎవరు చూడొచ్చారు?' 'ఎంతవేగిరం ఆ ప్రాంతం విడిచిపోతే అంత మంచిది' 'చివరికి పర్యవసానం కేసు కొట్టెయ్యటమేగా' 'వీల్లేదు యిక్కడ వుండటానికి వీల్లేదు.' 'ఆడవాళ్ళకి ప్రాణాలు కడగట్టుతున్నాయి.' 'మాట్లాడకుండా శవాన్ని అవతలకి లాగేసి గప్‌చుప్‌గా వెళ్ళిపోతే సరి' 'యిక్కడ వుండలేం. వుండలేం' 'క్షణమైనా వుండలేం.'

డ్రైవరూ, కండక్టరూ కూడా లొంగిపోయారు. 'మీరంతా సపోర్టు యిస్తామంటే చేసేదేముంది? కాని తర్వాత ఏమాత్రమైనా, ఏ నోటినుంచయినా మాట పొక్కిందా? మా పీకలమీద కొస్తుంది'

'ఎక్కడా పెక్కరియం. యిక్కడే మరిచిపోతాం'

'అలా అంటే చాలదు. తిరుపతి వెంకటేశ్వరుడిమీద ప్రమాణం చెయ్యాలి'

'అలాగే' అని 'ఈ రాత్రివేళ జరిగిన యాక్సిడెంటు గురించి గాని, ఆ మరణం గురించి గాని ఎక్కడా చెప్పమనీ, ఆ రహస్యం పదిలంగా దాచుకుంటామని ఏకగ్రీవంగా ప్రమాణం చేశారు—తిరుపతి వెంకటేశ్వరుడిమీద, స్టూడెంట్లతోసహా, ఒక్క డాక్టర్ చంద్రం తప్ప.

'నోనో! యిది తప్పు. మానవత్వానికే కళంకం. మనం తెల్లవారేదాకా యిక్కడ వుందాం. ఈ విషయం పోలీసులకి తెలియచేదాం. అన్నాడు ధైర్యంగా.

మిగతావాళ్ళంతా అతన్ని తినేసేటట్లు చూశారు. అవసరమైతే అతన్ని చంపి పారెయ్యాలన్నంత కసి వచ్చింది వాళ్ళలో.

సుబ్బారావు గబుక్కున అతని చేతులు పట్టుకున్నాడు. 'ఇవి చేతులుకావు కాళ్ళు. అవతల ప్రమాదంలో వున్న నా బిడ్డ. ప్లీజ్. కోపరేట్ చెయ్యండి'.

డాక్టర్ చంద్రం యింకేదో అనబోతున్నాడు

'నో! కాదనకండి. ప్లీజ్! ప్లీజ్! ప్లీజ్!

డాక్టర్ చంద్రం స్థాణువైపోయాడు—అచేతనంగా నిలబడిపోయాడు.

'డాక్టరుగారి తరఫున నేను ప్రమాణం చేస్తున్నాను. వెంకటేశ్వరుడి సాక్షిగా చెబుతున్నాను ఈ విషయం బయటికి పొక్కనియ్యం. నాదీ బాధ్యత'

అందరూ హర్షధ్వానాలు చేశారు

డ్రైవరు బస్సెక్కి కొస్త రివర్సు చేశాడు. శవం బయటపడింది. నలుగురు మనుషులు సాయంపట్టి, ఆ కళేబరాన్ని ఎత్తి రోడ్డు ప్రక్క నీళ్ళలో పడేసి ఆ నీళ్ళలోనే చేతులు కడుక్కువచ్చారు.

గబగబ అందరూ బస్సెక్కారు—డాక్టరు చంద్రంతో సహా.

తెల్లవారటానికి యింకా వ్యవధి వుంది.

'ఏడుకొండలవాడా! వెంకటరమణా! గోవిందా! గోవింద' ఒక్కసారి అనేక వందల సమూహధ్వని బయటకు వెలువడి, గుయ్యిన్ స్పష్టమైన చప్పుడును మింగేసింది.

ప్రయాణంలో చివరి అధ్యాయం ముగించుకునేందుకు — టూరిస్ట్ బస్సు కదిలింది.